# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 6 1 SEP, 2007

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70


## "ధర్మవాణి"

***ఆచ్చారద్ధమ్హి విరియమ్హి, సత్థా లోకే అనుత్తరో,***
***వీణోపమం కరిత్వా మే, ధమ్మం దేసేసి చక్ఖుమా॥***

***- థేరగాథా - 638***

జగత్తులో సాటిలేని జ్ఞానచక్షువులు గల ధర్మగురువు బుద్ధభగవానుడు, "అతి" మార్గములలో చిక్కుకుపోయి శ్రమిస్తున్న నావంటి అబోధునికి వీణను ఉపమానంగా ఇచ్చి ధర్మాన్ని ఉపదేశించాడు.

(తీగలు వదులుగా ఉంటే వీణ సరిగా పలుకదు. మరీ గట్టిగా బిగిస్తే తీగలు తెగిపోతాయి. వాటిని ఎంత అవసరమో అంతమాత్రమే బిగించాలి. సరిగ్గా ఇలాగే ధర్మమార్గంలో సోమరితనంతో సరిగా పనిచేయకపోవడము, మితిమీరిన పట్టుదలతో "అతి"లకు వెళ్ళి శ్రమించడము రెండూ పనికిరావు)

## రెండు 'అతి' మార్గముల మధ్య

ఆ రోజుల్లో అధికంగా ప్రజలు రెండు మార్గములనే అనుసరించేవారు. రెండూ 'అతి' మార్గములే. ఒకటి ప్రాపంచిక సౌఖ్యాల పట్ల అనురక్తి కలిగిన ప్రవృత్తి మార్గము, రెండవది వైరాగ్యంతో ముక్తి కొరకు ప్రయత్నించే నివృత్తి మార్గము. కాని రెండూ ఎంతో వికృతమై పోయి ఉండినాయి.

ప్రవృత్తి మార్గాన్ని అనుసరించే ప్రజలు, కామభోగాల బురదలో తలదాకా మునిగిపోయి, మూగ జంతువులను బలిఇస్తూ పురోహితులతో రకరకాల యజ్ఞాలు చేయించేవారు. ఇలా చేయడంవల్ల అగ్నిదేవుడు గాని, లేక ఇతర బ్రహ్మాది దేవతలుగాని తమపట్ల ప్రసన్నులవుతారని, తమకు అమరత్వం ప్రసాదిస్తారని నమ్మేవారు. నిస్సందేహంగా ఇది శుద్ధధర్మానికి వ్యతిరేక దిశలో, పాపాన్ని సమకూర్చే మార్గమే. అందువల్లనే దీనిని---

***"హీనో గమ్మో పోథుజ్జనికో అనరియో అనత్థసంహితో"***

- హీనుల, మూర్ఖుల, పృథక్‌జనుల, అనార్యుల మార్గము, అనర్థాన్ని సమకూర్చే మార్గము అని అన్నారు.

రెండవది నివృత్తిమార్గం. ఇది కూడా 'అతి'లకు వెళ్ళి---

***"అత్త కిలమథానుయోగో దుక్ఖో అనరిమో అనత్థసంహితో"***

- దుఃఖకరమైన స్వయంక్లేశ (దేహమును అత్యంత కష్టానికి గురిచేసే తపస్సులతో కూడిన) మార్గము; అనార్యుల అనర్థం కూడబెట్టే మార్గంగా, తయారైపోయి ఉండింది. ముక్తి మార్గానికి ఇది అన్నివిధాలా ప్రతికూలమైనది. భగవానుడు ఈ రెండు "అతి" మార్గములను త్యజించి, పురాతనం, సనాతనమైన "మధ్యమ" మార్గమును వెతికి వెలికితీసాడు. ఇది సర్వహితకారిణిగా సిద్ధించింది. "అతి" మార్గములలో పడి, దారి తప్పిన ఎందరికో సరైన ముక్తిమార్గం లభించింది. దర్మానికి సంబంధించిన అనుమానాలన్నీ దూరమయ్యాయి. వారంతా సహజంగానే దృఢతాపూర్వంగా సత్యమార్గం మీద నడిచి ముక్త్యావస్థను చేరుకొని, తమ కళ్యాణాన్ని సాధించుకోగలిగారు.

**ఈ సందర్భంలో భగవానుడి జీవితకాలం నాటి ఒక సంఘటన:**

జంబుకుడు అనేవ్యక్తి అత్యంత దరిద్రకులంలో జన్మించినవాడు. యుక్తవయసులో వైరాగ్యం కలిగి సన్యాసి అయ్యాక, ముక్తికోసం శరీరాన్ని కష్టపెట్టే ఆత్మక్లేశముల తపస్సు చేయసాగాడు. ముక్తికి దూరంగా తప్పుదారిలో పడిపోయాడు. "అతి" మార్గాన్నే ముక్తిమార్గంగా భావించాడు. శరీరాన్ని అత్యంతంగా కష్టపెట్టుకోవడమే చిత్త ప్రక్షాళనా విధానమని తలచాడు. జీవితంలో అధికభాగపు సమయమంతా మిథ్యామార్గంలోనే గడుపుతూపోయాడు. కానీ అతనికి ఏమీ ప్రాప్తించలేదు.

ఒకరోజు సౌభాగ్యం వల్ల, భగవానుడు అతను ఉండే వీధిగుండా వెళ్ళడం జరిగింది. జంబుకుని దయనీయమైన స్థితిని చూసి, కరుణతో భగవానుడు అతనికి మంగళకరమైన మధ్యమ మార్గమును ఉపదేశించాడు. ఏ పూర్వజన్మలోనో చేసిన పుణ్యకర్మ ఫలించి అతనికి విషయం అర్థమయింది. తప్పుదారిని వదిలిపెట్టి విపశ్యన అభ్యాసం చేయసాగాడు. కొద్దిరోజుల్లోనే ముక్తి యొక్క మొదటి మెట్టయిన "శ్రోతాపన్న" స్థితిని పొందాడు. దీనితో అతనిలో ఉత్సాహం మరింత పెరిగింది. నిర్విరామంగా సాధనలో నిరంతరతను స్థిరపరుచుకుంటూ, సమయం పరిపక్వం కాగానే పరమ ముక్త స్థితిని చేరుకుని అర్హంతుడయ్యాడు. అన్ని భవదుఃఖాల నుండి పూర్తిగా విముక్తుడయ్యాడు. జీవితపు చివరిదశలో శరీరాన్ని వదిలే సమయం ఆసన్నమయినప్పుడు, తన నిరర్థకమైన క్లిష్టమయ జీవిత విధానాన్ని వదలిపెట్టడం గురించీ, సమ్యక్ మార్గంలో నడిచి పరిపూర్ణ ముక్తుడైపోయిన సంఘటనను గుర్తుచేసుకునీ, ధర్మంపట్ల కృతజ్ఞతాపూర్వకంగా ఆనందాతిశయంతో గంభీర కంఠస్వరంతో ఇలా అన్నాడు:

*"పఞ్చ పఞ్ఞాస వస్సాని రజోజల్లమ్ ధారయిం"।*

– యాభై ఐదు సంవత్సరాలవరకు స్నానం చేయకుండా, ఒంటి మీద పేరుకుపోయిన దుమ్మునూ, మట్టినీ నలుచుకుంటూ ఉండేవాడిని.

*"బుఞ్జన్తో మాసికం భత్తం కేసమస్సుం అలోచయిం"।*

– నెలలో కేవలం ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తూ, నాతల, గడ్డం, మీసాల వెంట్రుకలను వేళ్ళతో పీక్కుంటూ ఉండేవాడిని.

*"ఏకపాదేన అట్ఠాసిం ఆసనం పరివజ్జయిం"।*

– కూర్చొనడం ఎప్పుడో త్యాగంచేశాను. ఇన్ని సంవత్సరాలుగా రాత్రింబవళ్ళు ఎక్కువ సమయం చేతులు పైకెత్తి ఒంటికాలిపై నిలబడేవాడిని.

*"సుక్ఖగూథాని చ ఖాదిం ఉద్దేసఞ్చ న సాదియిం"*

– అప్పుడప్పుడు ఎండిన విష్ట (మలము)ను తింటూ ఉండేవాడినే గాని గృహస్థుల ఆతిథ్యాన్ని మాత్రం స్వీకరించలేదు.

*"ఏతాదిసం కరిత్వాన బహుం దుగ్గతి గామినం"।*

– ఈ ప్రకారంగా అనేక దుఃఖదాయకమైన పనులు చేస్తుండేవాడిని.

*"బుయ్హమానో మహోఘేన బుద్ధం సరణమాగమం"।*

– ఇలా దుఃఖాల వరదలోపడి కొట్టుకొనిపోతూ నేను బుద్ధుని శరణులోకి వచ్చాను.

*"సరణాగమనం పస్స పస్స ధమ్మసుధమ్మతా"।*

"అహో! చూడండి, ఈ కల్యాణకారిణీ శరణాగమనము యొక్క మహత్వము చూడండి, ముక్తిదాయకమైన ధర్మం యొక్క మహత్వమును చూడండి.

*"తిస్సోవిజ్జా అనుప్పత్తా కతం బుద్ధస్స సాసనం"।*

– నేను ఆస్రవహీన స్థితికి చెందిన మూడు విద్యలనూ లభింపజేసుకుని బుద్ధుడి శాసనాన్ని పూర్తిచేశాను. అనగా ఆయన శిక్షణను పూర్తిచేశాను.

ధన్యుడు బుద్ధుడు! ధన్యము ధర్మము! ధన్యుడు సఫలుడైన ధర్మపథికుడు!

☆ ☆ ☆

**ఈ సందర్భంలోనే బుద్ధుడి జీవితకాలం నాటి మరోసంఘటన:**

అంగణిక భారద్వాజుడు హిమాలయాల దగ్గర ఉత్కృష్టమనే పేరు గల నగరంలోని వైభవసంపన్నమైన బ్రాహ్మణకులంలో జన్మించాడు. యౌవన ప్రాయాన్ని చేరుకునేసరికి పలురకాల లోకీయ విద్యలలో, కళలలో నిష్ణాతుడయ్యాడు. కాని అతనిలో వైరాగ్యం మేల్కొన్న కారణంగా అమరత్వం కోసం తపస్సు చేయుటకు బయలుదేరాడు. శాస్త్రోక్తమైన పద్ధతుల ప్రకారం అనేక రకాలుగా అగ్నికి పరిచర్యలు చేశాడు. శరీరానికి కష్టం కలిగించే పలు బాహ్యతపస్సులు చేశాడు.

ఇలా చేయడం వల్ల చిత్తవిశుద్ధి జరుగుతుందనీ, భవబంధాల నుండి విముక్తి లభిస్తుందనీ అనుకున్నాడు. కాని అలా జరుగలేదు. అదృష్టవశాత్తు బుద్ధుడు జనపదాలలో (నగరాలలో, గ్రామాలలో) ధర్మం ఉపదేశిస్తూ అతడున్న ప్రాంతానికి వచ్చాడు. ఈ యువతపస్వి బుద్ధుడి ధర్మప్రవచనం విన్నాడు. అత్యంత ప్రభావితుడై, బుద్ధుని శరణాగతుడయ్యాడు. ప్రవ్రజ్య తీసుకుని భిక్షువుగా మారాడు. విపశ్యన నేర్చుకున్నాడు. సాధనావిధిని అభ్యాసం చేస్తూ చాలాకాలంపాటు స్మృతి, సంప్రజ్ఞానములలో స్థిరపడుతూ చివరికి, అర్హంతస్థితిని చేరుకున్నాడు. విముక్తి సుఖముతో ఆనందాతిశయుడై అతడు తన జన్మభూమికి వెళ్ళాడు. అక్కడ తన పూర్వ కుటుంబ సభ్యులనెందరినో ప్రోత్సహించి వాళ్ళను ధర్మంలో ప్రతిష్ఠింపజేయుటలో సఫలుడయ్యాడు.

నిష్ప్రాణ నిర్జీవమైన కర్మకాండలలో, ఆత్మపీడనామిథ్యా తపస్సులలో చిక్కుకుపోయి ఉన్న అనేకమంది ప్రజలపట్ల ఎనలేని కరుణతో ఆప్లావితుడై (తడిసి ముద్దయి) వారిని మిథ్యామార్గము నుండి ముక్తులను చేసి, సత్యమార్గం వైపు మళ్ళించాలనే కల్యాణమయమైన కోరికతో ధర్మచారికకై బయలుదేరాడు. కురుదేశంలోని "కుండియ" అనే నగరానికి కొంత దూరంలో అరణ్యమార్గాన పయనిస్తూ ఉత్తరపథంవైపు వెళ్ళగా, ఒకచోట కొందరు బ్రాహ్మణులు సమావేశమై ఉండటం చూశాడు. వాళ్ళలో కొందరు అతనికి పరిచయం ఉన్నవారే. ఇతన్ని చూసి నిరసన వ్యక్తం చేస్తూ వాళ్ళిడిగారు---

"హే భారద్వాజ! నీకిదేం బుద్ధి పుట్టింది? అనాదిగా వస్తున్న మన పరంపరను వదిలి ఈ శ్రమణ పరంపర మార్గమునెందుకు చేపట్టావు?"

అంగణిక భారద్వాజుడు ఎంతో కరుణాపూరిత చిత్తంతో వాళ్ళకిలా తెలియజెప్పాడు---

"భవముక్తి కోసం చిత్తవిశుద్ధి కొరకై అడవిలో అగ్నికి పూజలు చేశాను. వివిధ రకాల ఆత్మపీడన తపస్సులు చేశాను. వాటి వల్ల ఫలితమేమీ కలుగలేదు. అవన్నీ నిరర్థకమైనవని తెలుసుకున్నాను. నిష్ప్రయోజనమైన కర్మకాండలు, కాయకంటకమైన తపస్సులు చేస్తూ నేను ఒక ఆశ్రమం నుండి మరో ఆశ్రమానికి, ఒక అరణ్యం నుండి మరో అరణ్యానికి తిరిగాను. చిత్తవిశుద్ధికి సరైన మార్గమేమిటో తెలియకపోవడం వల్లనే నేను వాటిలో చిక్కుకుపోయి ఉండినాను. ఇలాంటప్పుడు నాకు సరైన కళ్యాణకారి మార్గం లభించింది. నేను అన్నివిధాల సంతృప్తుడనయ్యాను. కృతకృత్యుడనయ్యాను. నా లక్ష్యం నెరవేరింది. నా మానవజన్మ సఫలమయింది.

*"తం సుఖేన సుఖం లద్ధం పస్స ధమ్మ సుధమ్మతం।*
*తిస్సో విజ్జా అనుప్పత్తా కతం బుద్ధస్స సాసనం॥*

శరీరానికి క్లేశం కలిగించే తపస్సుల కంటే విపశ్యన యొక్క విశుద్ధి మార్గం అత్యంత సుఖదమైనమార్గం. సాధకుడు అతిపోకడలను వదిలిపెట్టి, సుఖప్రదమైన మధ్యమ మార్గాన్ని అవలంబించి పరమసుఖ నిర్వాణము యొక్క ముక్త్యావస్థను లభింపజేసుకుంటాడు. అందుకే అంటాడు--

"నేను సుఖమైన మార్గము ద్వారా పరమ సుఖాన్ని ప్రాప్తించుకున్నాను"అని.

"చూడండి, ధర్మానికి ఎంత మహత్వముందో! నేను ముక్తికి సంబంధించిన మూడు విద్యలనూ లభింపజేసుకున్నాను. బుద్ధుడి శాసనాన్ని పూర్తిచేశాను. అనగా ఆయన విద్యను మొదటి నుండి చివరివరకు పాటించి జీవన గమ్యాన్ని సాధించుకున్నాను."

ఆ తరువాత సత్యదర్శియైన బ్రాహ్మణ భారద్వాజుడు నిర్మల చిత్తంతో, లోక హితం కోసం ఉచ్చస్వరంలో చెప్పసాగాడు......

"ఇంతకు ముందు నేను కేవలం నామమాత్రానికే బ్రాహ్మణుడను, బ్రాహ్మణ స్త్రీ గర్భంనుండి జన్మించాను కాబట్టి నన్ను నేను బ్రాహ్మణుడనని చెప్పుకునేవాడిని. కానీ ఇప్పుడు పునర్జన్మ పొందాను. బ్రహ్మభూతుడు, బ్రహ్మకాయుడు, ధర్మభూతుడు, ధర్మకాయుడైన ఆ భగవాన్ సమ్యక్ సంబుద్ధుని ఉరము (హృదయం) నుండి పుట్టాను. నేను ఆయన ఓరస పుత్రుడిని. ధర్మం వలన నాకు కొత్త జన్మ లభించింది కాబట్టి నేను ధర్మ నిర్మితుడిని. బ్రహ్మలాంటి శుద్ధ జీవితాన్ని గడుపుతాను కాబట్టి ఇప్పుడు నిజమైన అర్థంలో బ్రాహ్మణుడను."

"ఇంతకు ముందు కేవలం మూడు వేద గ్రంథాలను చదవడం వలన నామమాత్రపు త్రివేదజ్ఞుడను. కానీ ఇప్పుడు మూడు విద్యలనూ పూర్తి చేసి నిజమైన త్రివేదజ్ఞుడనయ్యాను. దివ్యదృష్టి, పూర్వజన్మస్మృతులే కాదు ఆ రెండింటినీ మించిన మూడవ విద్య అనగా ఆశ్రవక్షయ స్థితిని పూర్తిగా సాక్షాత్కరింపజేయు విద్యను లభింపజేసుకున్నాను. కాబట్టి ఇప్పుడు నేను నిజమైన అర్థంలో త్రివేదజ్ఞుడిని".

"ఇంతకుముందు కేవలం నదిలో స్నానమాచరించడం వల్ల, ధర్మశాస్త్రాలను పారాయణం చేయడం వల్లనే నన్ను నేను స్నాతకుడినని చెప్పుకునేవాడిని. కేవలం పేరుకు మాత్రమే స్నాతకుడను. కాని ఇప్పుడు పావనమైన ధర్మగంగలో మునకవేసి నిజమైన స్నాతకుడనయ్యాను. రాగ, ద్వేష, మోహాలన్నింటినీ పూర్తిగా నిర్మూలించుకొని అక్షయమైన నిర్వాణ మహాసాగరంలో మునకవేసి నేను నిజమైన అర్థంలో స్నాతకుడనయ్యాను. కేవలం నామమాత్రంగా కాదు".

"మొదట శృతిగ్రంథాలను వినడం, చదవడం వలన నన్ను నేను శ్రోత్రియుడనని చెప్పుకునేవాడిని. ఇప్పుడు ముక్తి శ్రోతలో పడి పూర్తిగా విముక్తుడనై పోయాను. అందువల్ల ఇప్పుడు నేను నిజమైన అర్థంలో శ్రోత్రియుడను."

"గతంలో నేను వేద గ్రంథములను పారాయణం చేసిన నామమాత్రపు వేదాంతిని. ఇప్పుడు నిజంగానే వేదాంతినయ్యాను. నా స్వీయ వేదనలను ఆధారం చేసుకొని ఆత్మజ్ఞానాన్ని మేలుకొలిపి, నా చిత్తములోని అన్ని కల్మష కషాయాలను దూరం చేసుకొని, సకల ఇంద్రియ ప్రపంచాన్నే గాక, ఇంద్రియాతీత అనంత అక్షయ పరమ సత్యాన్ని అనుభూతి ఆధారంగా దర్శించుకొని, స్వవేదనల ఆధారంగా వేదపారంగతుడనయ్యాను. వేదాంతిని అయ్యాను. కాబట్టి ఇప్పుడు నేను నామమాత్రపు వేదాంతిని కాదు. నిజమైన వేదాంతిని."

"అందువల్లనే చెబుతున్నాను మొదట నేను నామమాత్రపు వాడిని; కాని ఇప్పుడు నిజమైన బ్రాహ్మణుడను, త్రివేదజ్ఞుడను, స్నాతకుడను, శ్రోత్రియుడను (వేదాధ్యయనుడను), వేదాంతిని!'

ధన్యులు నిజమైన బ్రాహ్మణులు;
ధన్యులు నిజమైన త్రివేదజ్ఞులు;
ధన్యులు నిజమైన స్నాతకులు;
ధన్యులు నిజమైన శ్రోత్రియులు;
ధన్యులు నిజమైన వేదాంతులు;
ధన్యులు సరైన విద్య యొక్క నిజమైన సఫల సాధకులు.

రండి, సాధకులారా, మనం కూడా ఇలాంటి నిజబ్రాహ్మణులం, నిజస్నాతకులం, నిజవేదాధ్యయనపరులం, నిజవేదాంతులమై భవసాగరం నుండి ముక్తులమై జీవితాన్ని సఫలం చేసుకుందాం, మన మేలు సాధించుకొందాం. మానవ జన్మను సార్థకం చేసుకుందాం.

***భవతు సబ్బ మఙ్గలం***

కళ్యాణమిత్రుడు
**సత్యనారాయణ గోయెంకా**

*(విపశ్యన హిందీ పత్రిక ఏప్రిల్ 20, 1989 నుండి అనువాదం)*

## మొదట తెలుసుకోండి, తరువాతే నమ్మండి

(పుష్పా సావలా)

అదొక దట్టమైన అడవి. అందులో మారేడు వృక్షాలు చాలా ఉన్నాయి. ఆ వృక్షాల నీడలో చాలా కుందేళ్లు నివాసం ఏర్పరచుకొని ఉన్నాయి. సహజంగానే కుందేళ్లు పిరికివి. వాటిలో ఒక చిన్న కుందేలు మరింత పిరికిది. ఏ మాత్రం ఆకులచప్పుడు అయినా భయంతో అది గడగడ వణికేది.

ఒకరోజు అది ఒక మారేడుచెట్టు కింద పడుకుని ఉండగా దాని దృష్టి పైన ఉన్న నీలి ఆకాశం మీద పడింది. ఒక్కసారిగా దాని మనస్సులో వింత ఆలోచన కలిగింది.

"ఈ ఆకాశం విరిగి కిందపడితే నాగతి ఏమికాను?"

ఇక ఏముంది! భయం కలిగించే ఈ ఆలోచన మళ్లీ మళ్లీ దాని మనస్సులో మెదలసాగింది. కుందేలు భయానికి అంతే లేదు. దాని గుండె భయంతో దడ – దడా కొట్టుకోసాగింది. భయంతో కాళ్లుచేతులు ముడుచుకొని, కళ్లు మూసుకొని ఉండిపోయింది.

అంతలోనే ఏదో కింద పడినట్లుగా 'ధన్'మని శబ్దం వినిపించింది. కుందేలు భయానికి అంతేలేదు. 'అయ్య బాబోయ్! చచ్చానురోయ్! నిజంగానే ఆకాశం విరిగిపడింది' అనుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా తన ప్రాణాలను కాపాడుకోవడానికి అక్కడి నుండి పరుగుతీసింది. చాలా వేగంగా అరుచుకుంటూ "పారిపొండి, పారిపొండి! ఆకాశం విరిగిపడింది".

కుందేలు అలా పరుగెత్తడం చూసి ఇంకో కుందేలు కూడా భయపడి, కాళ్లకు పనిచెప్పి దాని వెనకాలే పరిగెత్తింది. ఇవి ఇలా అరుస్తూ పరిగెత్తడం చూసిన లేళ్లు కూడా భయపడ్డాయి. నిజంగానే ఏదో ముప్పు పొంచి ఉంటుందని భావించి అవి కూడా వాటి వెనకాలే పరిగెత్తసాగాయి. ఇవి పరిగెత్తడంచూసిన నక్కలు అనుకున్నాయి నిజంగానే అడవిలో ఏదో పెద్ద ఆపద సంభవించి ఉంటుందని. అవి కూడా పరుగందుకున్నాయి. ఇలా ఒకదాని తరువాత మరొకటి అడవిలోని జంతువులన్నీ పరుగెత్తసాగాయి. చివరకి భారీ శరీరం గల ఏనుగులు కూడా భయపడి, ఆ పరుగులో చేరిపోయాయి.

మొత్తం అడవి అంతా అల్లకల్లోలం అయింది. నలుదిక్కులా దుమ్ము, ధూళి చెలరేగింది. ఈ శబ్దాలను విని అడవికి రాజైన సింహం తన గుహ నుండి బయటికి వచ్చి ఏమి జరిగుంటుందో అని చూస్తూ ఉంది. అడవిలో ఉండే అన్ని జంతువులు ధైర్యాన్ని కోల్పోయి భయంతో వేగంగా పరిగెత్తడం చూసి దానికి ఆశ్చర్యమనిపించింది. ఇది దానికి నచ్చలేదు. తన గుహ ముందు నిలబడి గర్జించింది. అడవి అంతా సింహగర్జనతో ఒక్కసారిగా కంపించిపోయింది. పరుగెత్తుతున్న అన్ని జంతువులు భయభ్రాంతులై సింహగర్జనకు ఆగిపోయాయి. సింహం వాటి ముందుకు ఒక్క దూకు దూకి కోపంగా అడిగింది. "అందరు ఈ విధంగా ఎందుకు పరుగెత్తుతున్నారు?"

ఏనుగులన్నాయి : "మహారాజా, ఆకాశం విరిగింది మాప్రాణాలు కాపాడుకోవడానికి పరుగెత్తుతున్నాం"

సింహరాజు : "ఆకాశం విరగడం మీరేమయినా చూశారా!"

ఏనుగులన్నాయి : "లేదు మహారాజా మేమయితే చూడలేదు! ఈ ఖడ్గమృగాలు అలా అంటున్నాయి."

ఖడ్గమృగాలన్నాయి : "కాదు మహారాజా! మేము చూడలేదు. పులులు అంటుంటే విన్నాము, అవి నిజంగా చూసి ఉంటాయి."

పులులన్నాయి : "లేదు, లేదు మేము కూడా చూడలేదు, ఈ నక్కలు చూశాయి."

నక్కలన్నాయి : "మహారాజా, మేము స్వయంగా చూడలేదు. లేళ్ల ద్వారా విన్నాం, వాటికే తెలియాలి."

లేళ్లు అన్నాయి : "లేదు...లేదు మాకేమీ తెలియదు ఈ కుందేళ్లను అడగండి."

కుందేళ్లు అన్నాయి : "మాకు కూడా ఏమీ తెలియదు ఈ చిన్న కుందేలుకు తెలుసు."

అప్పుడు అడవి రాజైన సింహం దాన్ని అడిగింది. "నువ్వు ఆకాశం విరిగి పడటం స్వయంగా చూశావా?"

చిన్న కుందేలు చెప్పింది – "అవును మహారాజా! నేను చూశాను"

సింహం – "ఎక్కడ చూశావు?"

చిన్న కుందేలు వణకుతూ అంది. "కాదు మహారాజా! నాకు అక్కడికి వెళ్లడానికి చాలా భయం వేస్తుంది". సింహం ప్రేమతో అంది, "అరే, భయపడవల్సిన పనిలేదు, నీకు తోడుగా నేనున్నాను గదా!"

సింహం ఆ కుందేలును తన వీపుమీద కూర్చోబెట్టుకొని అడవి జంతువులన్నింటితో కలిసి ఆ మారేడు వృక్షాల దగ్గరికి తీసుకుపోయింది. కుందేలును తన వీపు నుండి కిందికి దించి అడిగింది, "ఇప్పుడు చెప్పు, ఆకాశం ఎక్కడ విరిగి కిందపడిందో?" భయం వల్ల కుందేలు మాట మూగబోయింది. దూరం నుండే అది ఆ స్థలాన్ని చూపించింది. సింహం అక్కడికి వెళ్లి చూడసాగింది. దాని దృష్టి నేల మీద పడిన ఒక మారేడు పండుపై పడింది. పండును తీసి అందరికి చూపిస్తూ అది గట్టిగా నవ్వసాగింది.

నిజమేమిటో అన్ని జంతువులూ తెలుసుకున్నాయి. సిగ్గుతో తలలు వంచుకున్నాయి. అవి తమలో తాము తిట్టుకున్నాయి. అసలు నిజంగాచూడకుండా కుందేలు మాటలు నమ్మి మూర్ఖులమయ్యాం. పిరికిదైన ఆ చిన్న కుందేలు తలెత్తి ఎవరివైపూ చూసే ధైర్యం చేయలేదు. సింహం అందరికి వివరించి చెప్పి అక్కడి నుండి తిరుగు ప్రయాణం అయింది.

నిజమేమిటో తెలుసుకోవాలనే కోరిక అందరికి ఉంటుంది. పరంపరాగతంగా ఏవైతే సంప్రదాయాలు పాటిస్తూ వస్తున్నారో వాటిని కేవలం అనుకోవడం వల్లనో... ఫలానా గురువు ఇలా అన్నాడు అని భావించడం వల్లనో నిజాన్ని తెలుసుకోలేకపోతాం. అసలు సత్యమేమిటి? దీన్ని ప్రతి ఒక్కరు తమకు తామే స్వయంగా తెలుసుకోవాలి. మన లోపల ఏదయితే సత్యం ఉందో దాన్ని ముందు స్వంత అనుభవంతో తెలుసుకుని ఆ తరువాతే నమ్మాలి. ముందు తెలుసుకొని నమ్మినట్లయితే ఏ భ్రమా, భ్రాంతీ ఉండదు.

*(విపశ్యన హిందీ పత్రిక ఏప్రిల్ 20, 1989 నుండి అనువాదం)*


**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం).**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2007-2009 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

TO


If Underlivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/3KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/3 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.